# ఆర్టీసీ బస్ డిపో ఆకాంక్షను నెరవేర్చి..

## ఏళ్ల నాటి కలకు రూపమిచ్చిన ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చొరవతో మంజూరు
- చెన్నూర్‌లో శరవేగంగా కొనసాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ వాసులు



శర వేగంగా సాగుతున్న బస్ డిపో నిర్మాణం పనులు



నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేస్తున్న విప్ బాల్క సుమన్

చెన్నూర్, నవంబర్ 9: చెన్నూర్ ప్రాంత ప్రజల చిరకాల కల నెరవేరబోతున్నది. చెన్నూర్‌లో బస్ డిపో కావాలని ఎప్పటి నుంచో ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. విప్ బాల్క సుమన్ చొరవతో ప్రభుత్వం చెన్నూర్‌కు బస్‌డిపో మంజూరు చేసింది. దీంతో డిపో ఏర్పాటుకు పట్టణ సమీపంలో నాలుగెకరాల స్థలం కేటాయింపుతో పాటుగా రూ. 4కోట్లు మంజూరు చేసింది. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ జులై 30న బస్ డిపో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇక నాటి నుంచి డిపో నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. ప్రహరీ, గ్యారేజ్, కార్యాలయం కోసం భవనాలు, వాషింగ్ ప్లాట్ ఫాం, ఆయిల్ స్టోర్ రూం, సెక్యూరిటీ రూం, మరుగు దొడ్లు లాంటి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తి కాగానే బస్ డిపోను ప్రారంభించనున్నారు.

### మెరుగు పడనున్న రవాణా సౌకర్యం

బస్‌డిపో ఏర్పాటుతో చెన్నూర్ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగనుంది. చెన్నూర్ నుంచి కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని గ్రామాలకు నిత్యం బ స్సులు నడువనున్నాయి. అంతేకాకుండా చెన్నూర్ మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాలకు జాతీయ రహదారి నిర్మా ణం కావడంతో అక్కడి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. చెన్నూర్ నుంచి హైదరాబాద్, ఆదిలాబ్, కరీంనగర్, గోదావరిఖని, నిజామాబాద్, వరంగల్, భూపాలపల్లి, కాళేశ్వరం లాంటి ప్రాంతాలకు కూడా రాకపోకలు పెరుగనున్నాయి. చెన్నూర్ పట్టణం వ్యాణిజ్యపరంగా అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం చెన్నూర్ పట్టణంతో పాటు కోటపల్లి, వేమనపల్లి మండలాల గ్రామాలకు, కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి, మహరాష్ట్రంలోని సిరోంచకు మంచిర్యాలలోని బస్‌డిపో ద్వారా బస్సులను నడుపుతున్నారు. దీంతో బస్సులు సరైన సమయానికి రాక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం 50కి పైగా బస్సులు నడుస్తుంటాయి. అంతేకాకుండా ఉదయం మంచిర్యాల డిపో నుంచి బస్సులు చెన్నూర్‌కు బయలుదేరి, తిరిగి చెన్నూర్ నుంచి మంచిర్యాలకు సాయంత్రం డిపోకు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులు లేక ఖాళీగానే తిరగాల్సి వస్తుండడంతో ఆర్టీసీకి కొంత మేర నష్టం వస్తున్నది. ఇక్కడ బస్ డిపో ఏర్పాటైతే ప్రజలకు రవాణ సౌకర్యం కలగడమే కాకుండా, ఆర్టీసీకి కూడా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం డిపో పనులు శరవేగంగా సాగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### బాల్క సుమన్‌తోనే సాధ్యమైంది



చెన్నూర్‌లో బస్‌డిపో ఏర్పాటు ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బాల్క సుమన్‌తోనే సాధ్యమైంది. ఇప్పటి వరకు ఎందరో నాయకులు ఇక్కడి నుంచి గెలిచినప్పటికీ బస్ డిపో ఏర్పాటును పట్టించుకోలేదు. బాల్క సుమన్ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రజల కోరిక మేరకు డిపో ఏర్పాటుకు కృషి చేసి, స్థలం కేటాయించటంతో పాటు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం డిపో నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. ఒక్క డిపోనే కాకుండా ఆయన వందల కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నరు. ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే చేయనంత అభివృద్ధి ఆయన చేసి చూపిన్రు.

*-గర్రెపల్లి శ్రీనివాస్ (కొమ్మెర, మండలం: చెన్నూర్)*

### ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం..




ఇప్పటి వరకు ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించిన నాయకులెవరూ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సీఎం కేసీఆర్ ఆశీస్సులతో వందల కోట్ల నిధులను తెచ్చి, నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాను. చెన్నూర్ ప్రజల చిరకాల కోరికైన బస్ డిపో నిర్మాణం కోసం కృషి చేసి, అవసరమైన నాలుగెకరాల స్థలంతో పాటు రూ 4 కోట్లు మంజూరు చేయించాం. పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ప్రజలకు మెరుగైన రవాణ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతోనే డిపో మంజూరు చేయించాం. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే, మరింత అభివృద్ధి చేసి చూపిస్తాం.

*-బాల్క సుమన్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ప్రభుత్వ విప్*

### తిప్పలు తప్పతయ్..

చెన్నూర్ పట్టణంలో బస్ డిపో ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిగి ప్రయాణికుల ఇబ్బందులు తీరనున్నాయి. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల గ్రామాలకు సరైన సమయానికి బస్సులు నడవనున్నాయి. ఇతర పట్టణ ప్రాంతాలకు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాలకు కూడా బస్సులు నడవనుండడంతో దూర ప్రాంత ప్రయాణికులకు కూడా మెరుగైన రవాణా సౌకర్యం కలుగనుంది. బస్ డిపో పనులు శరవేగంగా సాగుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

*-ముక్కెర బాపాగౌడ్ (గ్రామం: బావురావుపేట, మండలం: చెన్నూర్)*



### కల నెరవేరింది..

చెన్నూర్‌లో బస్ డిపో కావాలని ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు బస్ డిపో ఏర్పాటు గురించి ఏ నాయకుడూ పట్టించుకోలేదు. దమ్మున్న నాయకుడు బాల్క సుమన్ ప్రజల కోరిక మేరకు కృషి చేసి బస్ డిపోను మంజూరు చేయించడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరుతున్నది. రానున్న ఎన్నికల్లో బాల్క సుమన్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తాం.

*-గడ్డం ప్రశాంత్ (యువకుడు, చెన్నూర్)*



# నిఘా నీడన ఎన్నికలు

- సమస్యాత్మక ప్రాంతాలపై ఈసీ ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే అందుబాటులోకి బలగాలు
- సరిహద్దు పోలింగ్ కేంద్రాలపైనా నజర్
- పర్యవేక్షిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు
- ప్రశాంతంగా ముగించేందుకు పక్కా వ్యూహం అమలు



తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులలో నాటు పడవ సహాయంతో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ రాంనాథ్ కేకన్, ఏసీపీ మోహన్

కోటపల్లి, నవంబర్ 9: మంచిర్యాల జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు జరిగిన పోలింగ్ కేంద్రాలను దృష్టిలో పెట్టుకొని, ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు. గతంలో ఈ పోలింగ్ కేంద్రాల్లో జరిగిన సంఘటనల నేపథ్యంలో వీటిని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించగా, ప్రస్తుతం జరగనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో కోటపల్లి, వేమనపల్లి మండలాలు మహారాష్ట్ర సరిహద్దులో ఉండగా ఈ పోలింగ్ కేంద్రాల పై పోలీస్‌లు ప్రత్యేక నిఘా పెట్టారు.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

కోటపల్లి మండలంలో నక్కలపల్లి, పంగిడిసోమారం, వెంచపల్లి, సూపాక, రొయ్యలపల్లి, అన్నారం, ఆలుగామ, పుల్లగామ, రాజారం, వేమనపల్లి మండలంలో వేమనపల్లిలోని రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు సుంపుటం, జాజులపేట, నాగారం, చామనపల్లి పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవి. ఈ కేంద్రాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రశాంత ఎన్నికలతో పాటు పోలింగ్ శాతం పెంచేందుకు గ్రామ ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ పోలీసులు ముందుకు కదులుతున్నారు. ఈ కేంద్రాలు మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండగా అదనపు బలగాలను మోహరించి తనిఖీలు చేపడుతూ ప్రజలకు మేమున్నామనే భరోసాను కల్పిస్తున్నారు. వీటితో పాటు ఈ పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వెబ్ కాస్టింగ్ ద్వారా కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి ఎన్నికల సరళిని పర్యవేక్షించనున్నారు.



సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

### పోలింగ్ నాలుగు గంటల వరకే..

ఆయా చోట్ల రాజకీయ ఘర్షణలు, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఉండేదుకు మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకే జరగనుంది. ఈనెల 30న ఎన్నికలు జరగనుండగా ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన ఎన్నికల కమిషన్ మంచిర్యాల జిల్లాలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరిగేలా ఆదేశాలు జారీచేసింది.

### సరిహద్దు ప్రాంతాలపై నిఘా

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టిన జిల్లా ఉన్నతాధికారులు తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో పర్యటించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇప్పటికే పోలీస్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కోటపల్లి మండలంతో పాటు వేమనపల్లి మండలంలోని మారుమూల గ్రామాల్లో మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ రాంనాథ్ కేకన్, ఏసీపీ మోహన్‌లతో పాటు పోలీస్ అధికారులు పర్యటించారు. ఓటింగ్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.